సాక్షి
జోగులాంబ గద్వాల
గురువారం । 16 । ఫిబ్రవరి । 2023



చెంచుల పండుగకు ఏర్పాట్లు

నల్లమలలోని భౌరాపూర్‌లో చెంచుల పండుగ కోసం అన్ని ఏర్పాట్లు చేశారు.

వివరాలు 8లో ▸



సోలార్ యూనిట్లు మంజూరు

మహిళా సంఘాలకు ప్రభుత్వం సోలార్ యూనిట్లును మంజూరు చేయనుంది.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
36.2 /17.3

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం కాస్త పెరుగుతుంది. సాయంత్రం గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల అర్బన్: గ్రూప్–2,3,4 **ఉద్యోగాలకు** పోటీ పడుతున్న అభ్యర్థుల **కోసం జిల్లా** షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ ఇస్తున్నట్లు శాఖ జిల్లా అధికారి శ్వేతా ప్రియదర్శిని ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్ కులాలకు చెందిన నాన్ రెసిడెన్షియల్ అభ్యర్థులకు మూడు నెలల శిక్షణకు మిగిలిన సీట్లకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నామని, అభ్యర్థులు 21వ తేదీ లోగా తమ విద్యార్హత ధృవపత్రాలతో జిల్లా కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు.

సింధనూరు సర్పంచ్‌గా సుజాత



అయిజ: మండలంలోని సిధంనూరు సర్పంచ్ రంగమ్మ ఈనెల 6న అనారోగ్యంతో మృతిచెందడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సింధనూరు గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌గా ఉన్న సుజాతకు సర్పంచ్‌గా బాధ్యతలు అప్పగించారు. బుధవారం సింధనూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి విష్ణు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వార్డు సభ్యులతో తీర్మానం చేయించి సుజాతకు గ్రామ సర్పంచ్ బాధ్యతలను అప్పగించారు. గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, ప్రజల సమక్షంలో సుజాత సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టింది. అనంతరం ఆమెను గ్రామ పెద్దలు శాలువలు, పూలమాలలతో సత్కరించారు.

విద్యాసంస్థల్లో కంటి పరీక్షలు నిర్వహించాలి

గద్వాల అర్బన్: ప్రభుత్వం విద్యాసంస్థల్లో కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులకు నేత్రపరీక్షలు చేపట్టాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఆర్బీఎస్ ద్వారా గతంలో పాఠశాలల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించేవారన్నారు. రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంలో విద్యాసంస్థల్లో పరీక్షలు నిర్వహించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 18ఏళ్లు పైబడిన వారికి మాత్రమే పోర్టల్‌లో వివరాలను నమోదు చేసేందుకు అవకాశం కల్పించడంతో చిన్న వయస్సు ఉన్న వారికి నమోదు చేసేందుకు ఇబ్బందికి మారిందన్నారు. ప్రభుత్వం విద్యాసంస్థల్లో కంటి వెలుగు శిబిరాలు నిర్వహించి విద్యార్థులందరికి పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో పిడిఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీం పాష, జిల్లా ప్రధాన కార్యదర్శి హరీష్, నాయకులు శ్రీనివాస్, వంశీ, శివ, కార్తీక్ తదితరులు ఉన్నారు.

ఎదురుచూపులు..!

గర్భిణులకు అందని న్యూట్రిషన్ కిట్లు



జిల్లా ఆస్పత్రిలో వైద్య పరీక్షల నిమిత్తం ఎదురుచూస్తున్న మహిళలు, గర్భిణులు

- జిల్లాలో 2,029 మందికి నిలిచిన పంపిణీ
- ఇప్పటివరకు 4,453 మందికి మాత్రమే అందజేత
- రక్తహీనతతో గర్భిణుల సతమతం

గద్వాల క్రైం: గర్భిణుల్లో రక్తహీనతకు చెక్ పెట్టడమే లక్ష్యంగా కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేస్తుండగా.. జిల్లాలో వేలాది మందికి నేటికీ అందక ఎదురుచూపులు తప్పడంలేదు. న్యూట్రిషన్ కిట్ల పంపిణీని 2022 డిసెంబర్ 21న జిల్లాలో మంత్రి నిరంజన్‌రెడ్డి అట్టహాసంగా ప్రారంభించారు. మాతా శిశ సంరక్షణే లక్ష్యంగా జిల్లాలో 6,482 మంది గర్భిణిలను గుర్తించి న్యూట్రిషన్ కిట్లను గర్భిణులకు అందజేయాలని పథకం ప్రారంభించారు. ఇక 55 రోజుల వ్యవధిలో ఇప్పటి వరకు 4,453 మంది గర్భిణిలకు మాత్రమే కిట్లను అందజేశారు. 2,029 మంది గర్భిణిలు న్యూట్రిషన్ కిట్ల కోసం వేచి చూస్తున్నారు. పైస్థాయి నుంచి కిట్ల పంపిణీలో అలసత్వం జరుగుతుండడంతో కొన్ని రోజులుగా కిట్ల పంపిణీ మసకబారింది. మొదట్లో హడావుడిగా కిట్లను అందించారు.

అట్టహాసమేనా..?

గద్వాల, అలంపూర్‌లో రెండు ఏరియా ఆస్పత్రులు, 12 ప్రాథమిక, 5 అర్బన్ కేంద్రాలున్నాయి. ఎంతో అట్టహాసంగా ప్రారంభించిన న్యూట్రిషన్ కిట్ల పంపిణీ కార్యక్రమం అనంతరం సకాలంలో పంపిణీ చేయక పోవడంతో అబాసుపాలు అవుతుంది. పై స్థాయి నుంచి న్యూట్రిషన్ కిట్ల పంపిణీ లేకపోవడంతో జిల్లాలో సరఫరా నిలిచిపోయింది. గర్భిణులు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బందిని అడగడం పరిపాటిగా మారింది. మొదటి విడతలో పంపిణీ చేసిన రెండో విడత మాత్రం ఏరియా ఆసుపత్రిల్లో కిట్లను అందజేయాలి. సమయానికి ఇవ్వకపోవడంతో గర్భిణులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు స్పదించి కిట్లను అందేలా చర్యలు తీసుకోవాలంటున్నారు.

ప్రస్తుతం కిట్ల పంపిణీ సకాలంలో సరఫరా కాకపోవడంతో రక్తహీనతతో సతమతమవుతున్నారు. రోజూ స్థానిక ఏఎన్ఎంలను, ఆసుపత్రి సిబ్బందితో వాకబు చేస్తున్నారు.

కిట్లు రాలేదన్నారు..



ప్రస్తుతం ఐదు నెలలు నిండాయి. వైద్య పరీక్షల కోసం వెళ్లిన క్రమంలో న్యూట్రిషన్ కిట్ ఇస్తారని ఏఎస్ఎం తెలిపింది. పరీక్షల అనంతరం కిట్లు లేవని, రెండు రోజుల్లో వస్తాయని చెప్పారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మరోసారి వాకబు చేయగా ఇంక రాలేదన్నారు.

– మౌనిక, గర్భిణి, ఉండవెల్లి

త్వరలో అందజేస్తాం

న్యూట్రీషన్ కిట్ల సరఫరాలో కాస్త జాప్యం అయింది. పై నుంచి సరఫరా అయిన వెంటనే సిబ్బంది ద్వారా అందజేస్తాం. ఉన్నతాధికారులకు నివేదికాలు అందించాం. కిట్ల పంపిణీలో సమస్యలు లేకుండా వైద్యాధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

– డా. స్రవంతి, ప్రోగ్రాం ఆఫీసర్, గద్వాల

రక్తహీనతకు చెక్

జిల్లాలో న్యూట్రిషన్ కిట్లను రెండు విడతలుగా ఇవ్వనున్నారు. మొదటి విడత 14 నుంచి 27 వారాల సమయంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రల్లో అందజేయగా.. రెండో విడత 27 వారాల నుంచి 34 వారాల సమయంలో ఏరియా ఆసుపత్రిలో గర్భిణులకు గైనకాలజిస్ట్, స్కానింగ్, రక్త పరీక్షలు చేసిన తర్వాత ఆశ వర్కర్లు, ఏఎన్ఎంల ద్వారా అందించాలి. కిట్ల ద్వారా గర్భిణుల్లో రక్తహీనత తగ్గించడానికి కిట్‌లో కేజీ న్యూట్రీషన్ మిక్స్ పౌడర్, కేజీ ఖర్జూర, ఐరన్ సిరప్ మూడు బాటిల్స్, 500 గ్రాముల నెయ్యి, ఆల్ బెండజోల్ ట్యాబెట్లు, కప్పు, ప్లాస్టిక్ బాస్కెట్ వస్తువులు ఉంటాయి. న్యూట్రీషన్ కిట్ ద్వారా గర్భిణులతో పాటు బిడ్డకు పౌష్టికహారం అందుతుంది. రక్తహీనత తగ్గుతుంది.

ఇసుక అక్రమ రవాణా కట్టడికి చర్యలు



మైనింగ్ సిబ్బందికి యూనిఫాంలు అందజేస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

గద్వాల రూరల్: ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేసేందుకు మైనింగ్ శాఖ సిబ్బందికి ప్రత్యేక డ్రస్ కోడ్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. ఈమేరకు ఆమె బుధవా రం తన ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ అపూర్వ్‌చౌహాన్‌తో కలిసి మైనింగ్ సిబ్బందికి ఖాకీ డ్రస్‌ను పంపిణీ చేశారు. మైనింగ్ శాఖ అధికారి విజయరామరాజు, సిబ్బంది రవికుమార్‌రెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

అద్దె వాహనాలకు ధర నిర్ణయం

జిల్లాలో రైతులకు తక్కువ ధరకు అద్దెకిచ్చేలా వ్యవసాయ పరికరాలు, రవాణా వాహనాలను మహిళా సమాఖ్య, సెర్ప్ ఆధ్వర్యంలో కొనుగోలు చేయనున్నట్లు కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో అధికారులు, కంపెనీల ప్రతినిధులతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ పెట్టుబడులు తగ్గించి రైతులకు మేలు చేసేందుకు అవసరమైన వ్యవసాయ పరికరాలు, రవాణా వాహనాలకు సంబంధించి పది కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొని ధరలు నిర్ణయించడం జరిగిందన్నారు. మొత్తం రూ.56,96,800ల విలువ కలిగిన పరికరాలు. రవాణా వాహనాలకు సంబంధించి ధరలు నిర్ణయించినట్లు తెలిపారు. దీని ద్వారా రైతులు అద్దె వాహనాల కోసం చెల్లించే అధిక అద్దెలు తగ్గడంతో పాటు ఆర్థికంగా కూడా మేలు చేకూరుతుందన్నారు. సమావేశంలో డీఆర్‌డీవో నాగేంద్రం, డిప్యూటీ డీఆర్‌డీవో సరోజ, లీడ్‌బ్యాంక్ మేనేజర్ అయ్యపురెడ్డి, ఆర్డీవో పురుషోత్తంరెడ్డి, డీఏవో గోవిందునాయక్, పరిశ్రమల శాఖ జిల్లా అధికారి యాదగిరి, డీఎస్‌వో రేవతి, ఉద్యావన శాఖ అధికారి అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలకు ఎన్‌సీడీ కిట్లు

హైపర్ టెన్షన్, షుగర్ వ్యాధి గ్రస్తులకు ప్రభుత్వం ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. ఈమేరకు ఆమె కలెక్టరేట్‌లో జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు ఎన్‌సీడీ కిట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ హైపర్‌టెన్షన్ రోగులు 28,894, షుగర్ వ్యాధిగ్రస్తులు 13,608 మంది ఉన్నట్లు తెలిపారు. వీరికి ఎన్‌సీడీ కిట్లు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా వైద్యుల సూచన మేరకు మందులు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇంచార్జ్ డీఎంహెచ్‌వో డాక్టర్ శశికళ, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్దప్ప, ఆయా పీహెచ్‌సీ డాక్టర్లు, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ ద్వారానే రైతు రాజ్యం



తనగలలో మహిళలతో మాట్లాడుతున్న ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్

శాంతినగర్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే రైతు రాజ్యం వస్తుందని మాజీ ఎమ్మెల్యే ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హాత్‌సేహాత్ జోడో యాత్ర పదో రోజుకు చేరుకుంది. వడ్డేపల్లి మండలంలోని తనగల, కొంకల గ్రామాల్లో యాత్ర కొనసాగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 9 ఏళ్ల దొరల పాలనలో ఏ ఒక్కరికి ఇళ్లు మంజూరు చేయాలేదన్నారు. కరెంట్ బిల్లులు మోత మోగుతోందని, సిలిండర్ ధర అకాశాన్నంటిందన్నారు. నిత్యావసర సరుకులు నిరుపేదలకు అందడంలేదని, పంటలకు గిట్టుబాటు ధర రావడంలేదన్నారు. ప్రజలు వారి గోడును తనతో వెలిబుచ్చారన్నారు. కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు పాతయాత్ర చేసిన రాహుల్‌గాంధీ యాత్రకు దేశంలో విప్లవాత్మకమైన మార్పు వచ్చిందన్నారు. అవినీతి కుటుంబపాలన అంతమొదించేందుకు సమయం ఆసన్నమైందన్నారు. కాంగ్రెస్ రాజ్యం రాబోతోందని, రైతుల కష్టాలు తీరబోతున్నాయన్నారు. అలంపూర్ పాలన అవినీతి, కమీషన్లతో రాజ్యమేలుతోందని, అక్రమ ఇసుక, మద్యం దందాలతో అధికార పార్టీ నాయకులు అక్రమ ఆస్తులు కూడబెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అలంపూర్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ప్రతి గ్రామాన్ని సందర్శించి ప్రజలు పడుతున్న కష్టాలు తెలుసుకుని పరిష్కార దిశగా అడుగులు వేస్తూ ప్రజల ఆశయాలు నెరవేరేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సేవాలాల్ జీవితం ఆదర్శం



సేవాలాల్‌కు నివాళి అర్పిస్తున్న గిరిజన సంఘాల నాయకులు

గద్వాల న్యూటౌన్: గిరిజన, లంబాడీల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను బుధవారం జిల్లా గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక కృష్ణవేణి చౌరస్తా వద్ద సేవాలాల్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా పలువురు ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం రాకముందు ఆంగ్లేయులను ఎదురించి, యుద్ధం చేసిన మహవీరుడు సేవాలాల్ అని కొనియాడారు. లంబాడీ గిరిజనులను ఏకతాటిపై నడిసించారని చెప్పారు. లంబాడీ గిరిజనులు మద్యపానం సేవించకుండా, బాల్య వివాహలు జరిపించకుండా, స్త్రీ విద్యను అభ్యసించేలా చైతన్యం తీసుకొచ్చడని కొనియాడారు. సేవాలాల్ జీవితం నేటి యువతకు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో డీఏఓ గోవిందునాయక్, ఏడీఏ సక్రియా నాయక్, ట్రాఫిక్ ఎస్ఐ విజయ్‌కుమార్, సర్పంచ్ వీరేశ్‌నాయక్, హనుమంతు నాయక్, మునెప్ప, మీన నాయక్, సురేష్ నాయక్, భాస్కర్ నాయక్ పాల్గొన్నారు.

అందరూ కంటి పరీక్షలు చేయించుకోవాలి



అలంపూర్ రూరల్: కంటి సమస్యలతో బాధపడుతున్న వారితోపాటు 18 ఏళ్లు నిండిన వారందరూ కంటి వెలుగు శిబిరంలో పరీక్షలు చేయించుకోవాలని డిప్యూటి డీఎంహెచ్‌ఓ సిద్దప్ప అన్నారు. బుధవారం మండలంలోని క్యాతూర్ పీహెచ్‌సీ పరిదిలో అలంపూర్ న్యూప్లాట్స్‌లో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని ఆయన పరిశీలించారు. వైద్య సిబ్బంది తీసుకోవాల్సిన జగ్రత్తలపై సూచనలను, సలహాలు అందజేశారు. ఇదిలాఉండగా, కేంద్రంలో 132 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా.. 15 మందిని అపరేషన్ కోసం రెఫర్ చేశారు. మరో 25 మందికి కంటి అద్దాలను అందజేశారు. క్యాతూర్ పీహెచ్‌సీ పరిధిలోని లింగస్‌వాయిలో 146 మందికి పరీక్షలు చేశారు. డాక్టర్ ప్రసూణరాణి, డాక్టర్ రామస్వామి, లక్ష్మీకాంత్, హెచ్‌ఏ బాలీశ్వరయ్య, వైద్యా సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల గోడు పట్టని ప్రభుత్వం

శాంతినగర్: రాష్ట్ర రైతాంగానికి అందాల్సిన ప్రాణహిత–చేవెళ్ల నీటికి అడ్డుపడి కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టుకుని ఫామ్‌హౌస్‌కు తీసుకెళ్లి రైతులకు సీఎం కేసీఆర్ అన్యాయం చేస్తున్నారని బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షులు రామచంద్రారెడ్డి ఆరోపించారు. బుధవారం వడ్డేపల్లి మున్సిపాలిటిలో ప్రజాగోస–బీజేపీ భరోసా శక్తి కేంద్రం కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా నీళ్లు ఇస్తానని మొండి చేయి చూపించి రైతులకు ఘోస మిగిల్చారన్నారు. దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని ఇవ్వకుండా రైతుల దగ్గర ఉన్న భూములను అమ్ముకున్నారన్నారు. శాంతినగర్ సంతలో ఎన్నో సంవత్సరాల నుండి వసతులు లేక రైతులు, వ్యాపారులు, ప్రజలు మండుటెండలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సంత, తైబజార్‌ల ద్వారా లక్షల్లో ఆదాయం వున్నా వసతులు కల్పించడంలో విఫలమయ్యారన్నారు. నరేంద్రమోదీ రైతుల కొరకు ఎన్నో పథకాలు తీసుకొచ్చారని, 18 రకాల పంటలకు మద్దతుధర పెంచి రైతులకు న్యాయం చేస్తున్నారన్నారు. కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రైతులకు ఏడాదికి రూ.8 వేలు సహకారం అందిస్తున్నారన్నారు. రైతులకు ఎన్నో సహకారాలు అందిస్తున్న బీజేపీ ప్రభుత్వాని ఆదరించాలన్నారు. నాయకులు రామకృష్ణ, భీంసేన్‌రావ్, రంజిత్‌పటేల్, పైపాడు వెంకటేష్, ప్రదీప్‌స్వామి, లక్ష్మణ్‌గౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉల్లి ధర ఢమాల్!

- భారీగా పడిపోయిన ధైనం
- క్వింటాల్ కనిష్టంగా రూ.400, గరిష్టంగా రూ.1,200
- ఆందోళనలో రైతులు

దేవరకద్ర: స్థానిక మార్కెట్ యార్డులో బుధవారం నిర్వహించిన బహిరంగ వేలంలో ఉల్లి ధరలు భారీగా పడిపోయాయి. క్వింటాల్‌కు కనిష్ఠంగా రూ.400, గరిష్ఠంగా రూ.1,200 వరకు ధరలు వచ్చాయి. పేడుగా, చిన్నగా ఉన్న ఉల్లిని వ్యాపారులు కనీసం వేలం కూడా వేయకుండా ధరలు నిర్ణయించారు. చిన్న ఉల్లిని క్వింటాల్‌గా రూ.150 నుంచి రూ. 200 వరకు కొనుగోలు చేశారు. గత వారంతో పోలిస్తే గరిష్ఠంగా రూ.400, కనిష్ఠంగా రూ.500 వరకు ధరలు పడిపోయాయి. కొన్ని వారాలుగా ఉల్లి ధరలు నిలకడగా ఉండగా, ఈ వారం వేలంలో కనీసం కోతలు కోయడానికి పెట్టిన కూలి కూడా రాని పరిస్థితి ఏర్పడింది. గతంలో లాక్‌డౌన్ వల్ల మార్కెట్ మూతపడిన సమయంలో కూడా ఉల్లికి కనీస ధరలు వచ్చి రైతులు కొంత లాభాలు పొందారు. ఇప్పటి పరిస్థితి చూస్తే పెట్టుబడి దేవుడెరుగు కనీసం కూలీ, రవాణా ఖర్చులు రావడం లేదని రైతులు వాపోతున్నారు.

దిగుబడులు పెరగడం వల్ల..

కొందరు రైతులు వేలం వేయకుండానే నేరుగా ఉల్లిని వ్యాపారులకు విక్రయించారు. వేలం వేసి కొనడానికి వ్యాపారులు ముందుకు రాకపోవడంతో వచ్చిన ధరకే అమ్ముకున్నారు. కనీస ధరలు రాక తిరిగి వెళ్దామనుకుంటే మళ్లీ రవాణా ఖర్చులు భరించాల్సి ఉండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో నిరాశతో అమ్ముకోవాల్సి వచ్చింది. కాగా.. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి హైదరాబాద్‌కు ఉల్లి దిగుమతులు ఎక్కువ అయ్యాయని, దీంతో పాటు ధరలు తక్కువగా ఉండడంతో ఇక్కడి మార్కెట్‌లో ధరలు తగ్గాయని వ్యాపారులు అంటున్నారు. రైతులు ఎక్కువగా ఎర్ర ఉల్లిని పండించిన కారణంగా ధరలు రావడం లేదని, తెల్ల ఉల్లికి కొంత వరకు డిమాండ్ ఉందని తెలిపారు. ప్రస్తుతం దిగుబడులు ఎక్కువగా ఉండడం, ఎర్ర ఉల్లిని నిల్వ చేసుకోవడానికి వీలు లేకపోవడం వల్ల వారం రోజుల్లో ఉల్లిని కొనడంతో పాటు అమ్మకాలు పూర్తి చేయాల్సి ఉంటుందని, దీంతో ధరలు తగ్గుతున్నాయని అంటున్నారు.

వేరుశనగ క్వింటా రూ.7,711

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్ యార్డుకు బుధవారం 864 క్వింటాళ్ళ వేరుశనగ రాగ, క్వింటాలుకు గరిష్ఠం రూ.7711, కనిష్ఠం రూ. 3369, సరాసరి రూ. 7189 ధరలు లభించాయి. అలాగే, 35 క్వింటాళ్ళ ఆముదం రాగా గరిష్ఠం రూ. 6489, కనిష్ఠం రూ.5856, సరాసరి రూ. 6489 ధరలు పలికాయి. 29 క్వింటాళ్ళ కంది రాగా, గరిష్ఠం రూ. 6966, కనిష్ఠం రూ. 6826, సరాసరి రూ. 6926 ధరలు వచ్చాయి.

సాధన లేక ఇంటి దారి

- ఎస్ఐ, కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభం
- 494 మందిలో 165 తుది పరీక్షకు అర్హత
- పర్యవేక్షించిన ఐపీఎస్ అధికారి యోగేష్ గౌతమ్, ఎస్పీ నర్సింహ



ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న సిబ్బంది

మహబూబ్‌నగర్ క్రైం: ఎస్ఐ, కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలను జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 6:15 గంటలకు స్థానిక జిల్లా క్రీడా మైదానంలో ఐపీఎస్ అధికారి యోగేష్ గౌతమ్, ఎస్పీ నర్సింహ ప్రారంభించారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి అభ్యర్థులు మైదానం బయట ఎదురు చూశారు. మొదటి రోజు 600 మందికి 494 మంది హాజరు కాగా, 165 మంది తుది రాత పరీక్షకు అర్హత సాధించారు. ఒక్కో బ్యాచ్‌లో ఆరుగురికి అనుమతి కల్పించారు. ఈసారి రేడియో ఫ్రీక్వెన్సీ గుర్తింపు పద్ధతితో నిర్వహించిన పరీక్షలలో మొదట వచ్చిన ప్రతి అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్లు పరిశీలన చేసి, 1,600 మీటర్ల పరుగు పోటీ నిర్వహించారు. ఇందులో అర్హత సాధించిన వారికి మాత్రమే ఎత్తు, బరువు, లాంగ్‌జంప్, షాట్‌పుట్ నిర్వహించారు. 494 మంది అభ్యర్థులకు పరుగు పోటీ నిర్వహిస్తే 241 అర్హత సాధించారు. 253 మంది ఇంటిదారి పట్టారు. ఎత్తులో 210 మంది క్వాలిఫై కాగా.. 31 మంది అనర్హత పొందారు. లాంగ్‌జంప్‌లో 171 మంది, షాట్‌పుట్‌లో 165మంది క్వాలిఫై అయి.. తుది రీక్షకు అర్హత సాధించారు.

పరుగు పోటీలో అవస్థలు..

మొదట నిర్వహించిన పరుగు పోటీలలో చాలా మంది అభ్యర్థులు అర్హత సాధించలేకపోయారు. ఎత్తు, లాంగ్ జంప్‌లో కొందరు వెనుతిరిగారు. షాట్‌పుట్‌లో మాత్రం దాదాపు అందరూ అర్హత సాధించారు. ప్రధానంగా పరుగు పందెంలో ప్రతి బ్యాచ్‌లో ఆరుగురు చొప్పున పాల్గొంటే ముగ్గురు, నలుగురు మాత్రమే నిర్దేశించిన సమయంలో వస్తున్నారు. లాంగ్ జంప్‌లో 2.5 మీటర్లు దూకాల్సిన క్రమంలో చాలా మంది అభ్యర్థులు కష్టపడ్డారు.



లాంగ్ జంప్ చేస్తున్న అభ్యర్థులు



పరుగు పందెంలో అభ్యర్థులు

ఇంటర్ ప్రయోగ పరీక్షలు ప్రారంభం

గద్వాల: ఇంటర్మీడియెట్ ప్రయోగ పరీక్షలు మొదటిరోజు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. బుధవారం ఉదయం, మధ్యాహ్నం వేళల్లో జంతుశాస్త్రం, వృక్ష, భౌతిక, రసాయన శాస్త్ర ప్రయోగ పరీక్షలు నిర్వహించారు. కళాశాలల్లో అన్ని వసతులు ఉండి సీసీ కెమెరాలు బిగించుకున్న వాటికే పరీక్ష కేంద్రాలుగా అనుమతి ఇస్తామని ఆర్భాటంగా ప్రకటించిన అధికారుల మాటలు క్షేత్రస్థాయిలో అక్కడక్కడ కనిపించలేదు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు కలిపి 31 జూనియర్ కళాశాలలు ఉండగా.. మొదటి రోజు తొమ్మిది కళాశాలల్లో ప్రయోగ పరీక్షలు నిర్వహించారు. గతంలో మాదిరిగానే ఈ సారి కూడా ఇంటర్మీడియేట్ స్థాయిలో ప్రయోగ పరీక్షలు విద్యార్థులు చదువుతున్న సొంత కళాశాలల్లోనే అక్కడి అధ్యాపకుల సమక్షంలో జరగడం విశేషం.

వెంటనే మార్కుల నమోదు

గతానికి భిన్నంగా ప్రయోగ పరీక్షల నిర్వహణ సాగింది. ఆన్‌లైన్ ద్వారా ప్రశ్నాపత్రంలోని ప్రశ్నలను విద్యార్థులకు ఇచ్చారు. పరీక్ష ముగిసిన వెంటనే సంబంధిత అధ్యాపకులు వాటిని మూల్యాంకనం చేసి, మార్కులను ఇంటర్‌బోర్డు వెబ్‌సైట్‌లో అప్పటికప్పుడు నమోదు చేశారు. ఉదయం జరిగిన ఇంటర్ జనరల్ విభాగంలో 421 మంది విద్యార్థులకుగాను 397 మంది విద్యార్థులు హాజరుకాగా.. 24 మంది గైర్హాజరయ్యారు. ఒకేషినల్ కోర్సులో 373 మంది విద్యార్థులకు గాను 339 మంది విద్యార్థులు హాజరరుకాగా.. 34 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ఇంటర్ జనరల్ విభాగంలో 328 మంది విద్యార్థులకు గాను 314 మంది విద్యార్థులు హాజరుకాగా.. 14 మంది గైర్హాజరయ్యారు. వృత్తి విద్యా కోర్సులో 391 మంది విద్యార్థులకు గాను 350 మంది విద్యార్థులు హాజరుకాగా..41 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.



గద్వాలలో ప్రయోగ పరీక్షలను పరిశీలిస్తున్న డీఐఈఓ హృదయరాజు

అధికారుల తనిఖీ

బుధవారం మొదటి విడతలో కొనసాగిన ఇంటర్ ప్రయోగ పరీక్షలను జిల్లా ఇంటర్ విద్య అధికారి హృదయరాజు తనిఖీ చేశారు. ఆయా కళాశాలల్లో విద్యార్థులు చేపట్టిన ప్రయోగ పరీక్షలను దగ్గరుండి పర్యవేక్షించారు. ఆన్‌లైన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకున్న ప్రశ్నలకు విద్యార్థులు సరైన ప్రయోగ పరీక్షలు చేస్తున్నారనే దానిపై పరిశీలించారు. అనంతరం మూల్యాంకనం, మార్కుల నమోదు తదితర వాటిపై అధ్యాపకులకు దిశానిర్దేశం చేశారు. ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా పారదర్శకంగా పరీక్షలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు.

క్లుప్తంగా

తీవ్ర జ్వరంతో యువకుడు మృతి


షెడ్రక్ (ఫైల్)

మల్దకల్: తీవ్ర జ్వరంతో ఓ యువకుడు మృతి చెందాడు. బుధవారం మండలంలోని అమరవాయి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పెద్ద నర్సింహులు, మార్తమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు షెడ్రక్(18)కు నాలుగు రోజుల క్రితం జ్వరం రావడంతో కుటుంబ సభ్యులు కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన డాక్టర్లు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ఇటీవలే తండ్రి పెద్ద నర్సింహులు మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు.

విద్యార్థి అదృశ్యం: కేసు నమోదు

భూత్పూర్: మండలంలోని పోతులమడుగు గ్రామపంచాయతీ అనుబంధ గ్రామమైన గోపన్నపల్లికి చెందిన గణేష్ అలియాస్ శివ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గోపన్నపల్లికి చెందిన కోట్ల నారాయణ కుమార్తె అంజమ్మ 10 ఏళ్ల కిందట మృతిచెందిగా.. ఆమెకు కుమార్తె స్వప్న, కుమారుడు గణేష్ అలియాస్ శివ ఉన్నారు. అంజమ్మ మృతిచెందడటంతో పిల్లలు అమ్మమ్మ ఇంటి వద్దే ఉంటున్నారు. గణేష్ మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. ప్రతి నిత్యం మాదిరిగా మంగళవారం ఉదయం 7:30 గంటల ప్రాంతంలో గోపన్నపల్లి నుంచి పాఠశాలకు వెళ్తున్నానని స్కూల్ బ్యాగ్‌తో భూత్పూర్‌కు వచ్చాడు. సాయంత్రం పాఠశాల నుంచి తిరిగి ఇంటికి రాకపోగా.. పాఠశాల యాజమాన్యం, తోటి విద్యార్థులను విచారించగా.. మంగళవారం పాఠశాలకు రాలేదని చెప్పారు. దీంతో బుధవారం భూత్పూర్ పోలీసులకు తమ మనువడు అదృశ్యమయ్యాడని, పాఠశాలకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని, బంధువులు, పాఠశాల యాజమాన్యం, తోటి విద్యార్థులను విచారించినా.. ఎలాంటి ఆచూకి లభించలేదని పోలీసులకు తెలియజేశారు. బాలుడి తాత నారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వివరించారు.

గౌతాపూర్‌లో మహిళ..


నాగమణి(ఫైల్)

బాలానగర్: మహిళ అదృశ్యమవగా బుధవారం కేసు నమోదు చేశామని ఏఎస్‌ఐ నాగేశ్వర్ రెడ్డి తెలియజేశారు. అందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. జడ్చర్ల మండలం పోలేపల్లికి చెందిన నాగమణి(38) తన తల్లిగారి ఇళ్లయిన బాలానగర్ మండల పరిధిలోని గౌతాపూర్‌కు జనవరిలో వచ్చింది. ఫిబ్రవరి 12వ తేదీ ఉదయం 10 గంటల వరకు గౌతాపూర్‌లోనే ఉన్న నాగమణి నాలుగు రోజులుగా కనిపించడం లేదని భర్త శివానంద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలియజేశారు.

మృతదేహంతో నిందితుడి ఇంటి వద్ద బైఠాయింపు

రాజాపూర్: మండలంలోని రాయపల్లిలో మృతదేహంతో నిందితుడి ఇంటి ముందు కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెలితే శనివారం రాయపల్లిలో లక్ష్మయ్య అతని కుమారుడు శివలింగం గ్రామానికి చెందిన శివకుమార్‌పై దాడిచేయడంతో మంగళవారం సాయంత్రం చికిత్స పొందుతూ మృతి చెందాడు. బుధవారం మృతుడి కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున మృతదేహంతో గ్రామంలోని నిందితుల ఇంటి వద్ద ఆందోళనకు దిగారు. న్యాయం జరిగే వరకు మృతదేహాన్ని అక్కడ నుంచి తీసే ప్రసక్తే లేదని భీష్మించుకుని కూర్చున్నారు. సర్పంచ్ అనురాధ గౌడ్, ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి నచ్చజెప్పినా వారు వినలేదు. పది రోజులైనా మృతదేహాన్ని అక్కడే ఉంచుతామని చెప్పి, ఆందోళన కొనసాగించారు.

కొండనాగులలో ఎక్సైజ్ దాడులు

బల్మూర్: మండలంలోని కొండనాగుల గ్రామంలో బుధవారం అచ్చంపేట ఎక్సైజ్ సీఐ కృష్ణ ఆధ్వర్యంలో నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. మూడు క్వింటాళ్ల నల్లబెల్లం, పటిక, 15 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. రెండువేల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. గ్రామంలో ఓ పాడుబడిన ఇల్లును ఇదే గ్రామానికి చెందిన ఓవ్యక్తి ఉపయోగించుకుంటున్నట్లు తమ విచారణలో తేలిందని సీఐ తెలిపారు. నిందితుడు పరారీలో ఉన్నాడని, అతన్ని పట్టుకుని కోర్టులో హాజరు పర్చనున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్‌ఐలు బాలరాజ్, సతీష్, సిబ్బంది ప్రకాష్, ఆంజనేయులు, బాలయ్య, నవీన్ పాల్గొన్నారు.

పేకాట రాయుళ్లు అరెస్ట్

అయిజ: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి 11 మందిని అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలో సన్‌రైజ్ ఆస్పత్రి సమీపంలో బుధవారం పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో పోలీసు బృందం దాడిచేసి 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.34,940 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

చెంచుల పండుగకు ఏర్పాట్లు


ముస్తాబైన భ్రమరాంబిక, మల్లికార్జునస్వామి ఆలయాలు

రేపటి నుంచి భౌరాపూర్ ఉత్సవాలు

- మూడురోజుల పాటు కొనసాగింపు
- 18న భ్రమరాంభిక, మల్లన్న కల్యాణం
- వివిధ జిల్లాల చెంచులు రాక
- ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

అచ్చంపేట: ఏటా శివరాత్రి పర్వదినాన నల్లమలలోని భౌరాపూర్ భ్రమరాంబ ఆలయంలో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా 'చెంచుల పండుగ' నిర్వహిస్తోంది. 17 నుంచి 19వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు కలెక్టర్ ఉదయ్‌కుమార్ ఈ నెల14న అధికారులతో సమావేశం నిర్వహించి సౌకర్యాల కల్పనపై పలు సూచనలు చేశారు. పురాతన ఆలయంలో కొలువుదీరిన భ్రమరాంబిక, మల్లికార్జునస్వామికి మహా శివరాత్రి రోజున శ్రీశైలంలో జరిగే ఉత్సవాల తరహాలోనే ఇక్కడ కూడా కల్యాణం జరిపిస్తారు. ఏడేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం ఐటీడీఏ ఆధ్వర్యంలో అధికారికంగా ఉత్సవాలు నిర్వహిస్తోంది.

రహదారి సౌకర్యం, ఆదరణ లేక కనుమరుగు

అప్పట్లో శ్రీశైలానికి భౌరాపూర్ మీదుగా కాకుండా వటువర్లపల్లి–దోమలపెంట మీదుగా రోడ్డు వేశారు. దీంతోపాటు పట్టించుకొనే వారు లేక ఎంతో ప్రసిద్ధి చెందిన భౌరాపూర్ ఉత్సవాలు మరుగునపడ్డాయి. ఆదివాసీ సంప్రదాయ ఉత్సవాలను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో 2016లో అన్ని చెంచుపెంటలు, గ్రామాల్లో ప్రచారం కల్పించారు. దీంతోపాటు ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత చెంచు గిరిజనులు గిరిజన సంక్షేమశాఖ మంత్రిని కలిసి ఇక్కడి పరిస్థితిని వివరించడంతో నాటి నుంచి ప్రభుత్వం అధికారికంగా ఈ పండుగను నిర్వహిస్తోంది.

జాతరకు వెళ్లేది ఇలా..

జాతరకు వెళ్లే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆర్టీసీ అధికారులు బస్సులు నడుపుతారు. అమ్రాబాద్ మండలం మన్ననూర్ నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఫర్హాబాద్ చౌరస్తా వద్ద అటవీశాఖ ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు ప్రధాన రహదారి నుంచి 15 కిలోమీటర్లు అటవీ ప్రాంతంక్ష ప్రయాణం చేయాలి. ఉత్సవాల నిర్వాహకులు, అధికారులు జాతరకు వెళ్లే మార్గాన్ని సూచిస్తూ ఫ్లెక్సీలు కూడా ఏర్పాటు చేస్తారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చేవారు శ్రీశైలం నుంచి ఫర్హాబాద్ చౌరస్తా చెక్‌పోస్టు వద్దకు వచ్చి అటవి మార్గంలో భౌరాపూర్ చేరుకోవచ్చు. భౌరాపూర్ కొత్తగా ఏర్పడిన అప్పాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఉండటంతో సర్పంచ్ బాలగురువయ్య, ఆలయ కమిటీ ఉత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తోంది.

కార్యక్రమాలు ఇలా..

17న ఉదయం 10 నుంచి సాయంత్రం 4 వరకు స్వాగతోపన్యాస కార్యక్రమాలు, సాయంత్రం 4 నుంచి అర్ధరాత్రి 12 వరకు చెంచుల సంస్కృతి ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాలు, సంప్రదాయ నృత్యాలు ఉంటాయి.

- 18న ఉదయం 8 నుంచి 9.55 వరకు అల్పాహారం, 10 నుంచి11 వరకు ముఖ్యఅతిథులకు స్వాగతం, వేదపండితులతో గణపతి పూజ, రుద్రహోమం, అభిషేకం, అంకురార్పణ అనంతరం శ్రీ భ్రమరాంబ, మల్లికార్జునస్వామి కల్యాణం.
- 19న స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. ఉత్సవాల్లో వివిధ శాఖల స్టాల్స్ ఏర్పాటు, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తారు. ఉత్సవాలకు నల్లమల చెంచులతో పాటు నల్లగొండ, రంగారెడ్డి, వికారాబాద్, ఆంధ్రప్రదేశ్ నుంచి కూడా చెంచులు, ఇతర సామాజికవర్గాల ప్రజలు అధికసంఖ్యలో తరలివస్తారు.

అధికారులకు బాధ్యతలు..

ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కలెక్టర్ వివిధ శాఖల అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ప్లాస్టిక్ వినియోగించకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. ఆలయ అలంకరణ, విద్యుద్దీకరణ, వైద్యసేవలు, 108, ఫైరింజన్లు, తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం తదితర మౌలిక వసతులు కల్పించడంతో పాటు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అటవీ, పోలీసుశాఖ సమన్వయంతో పర్యవేక్షించనున్నారు. అవసరమైనచోట సీసీ కెమెరాలు, మార్గమధ్యంలో పెంటల వద్ద మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సాయంత్రం 6లోపు గమ్యస్థానాలకు చేరుకోవాలని, సమయం దాటిన తర్వాత రిజర్వ్ ఫారెస్ట్‌లోకి అనుమతి ఉండదని డీఎఫ్‌ఓ రోహిత్‌రెడ్డి తెలిపారు.

ఆలయ ప్రాశస్త్యం..

ఇక్కడి రాజ్యాన్ని పాలించిన రెడ్డిరాజులు, చాళక్యులు, ఈక్ష్వాకుల కాలంలో భౌరాపూర్ చెరువు వద్ద భ్రమరాంబిక ఆలయ నిర్మాణం జరిగినట్లు చారిత్రక ఆధారాలున్నాయి. ఆలయానికి ఎదురుగా ఉన్న చెరువుకట్టపై వీరభద్రుడు, మూడు కిలోమీటర్ల దూరంలో నైరుతి వైపున ఒంటి వీరన్న (వీరభద్రుడు) వెలిశారు. దీంతో ఆ ప్రాంతమంతా పుణ్యక్షేత్రంగా మారింది. ఆలయ నిర్మాణం జరగటంతో మహాశివరాత్రి సమయంలో శ్రీశైలంలో ఉత్సవాలు ఎంత ఘనంగా జరుగుతాయో భౌరాపూర్ జాతర కూడా చెంచుల సంప్రదాయాల ప్రకారం వైభవంగా నిర్వహిస్తారు. శ్రీశైలానికి వెళ్లివచ్చే భక్తులతో పాటు నల్లమల చెంచులు భౌరాపూర్ ఉత్సవాల్లో పాల్గొంటారు.


భ్రమరాంబికాదేవి


శివయ్య


వీరభద్రస్వామి

పాదయాత్రకు అడ్డంకులు


బోటు వద్ద శివభక్తుల రద్దీ

- ఒకరోజు మొత్తం కృష్ణానది ఒడ్డునే కూర్చుండి పోయిన శివభక్తులు
- బోట్లు నడవక తీవ్ర ఇబ్బందులు

పెంట్లవెల్లి: మండల పరిధిలోని మల్లేశ్వరంలో శివస్వాములు మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం 12 గంటల వరకు కృష్ణానది ఒడ్డునే కూర్చుండిపోయారు. ప్రతి సంవత్సరం ఇతర గ్రామాల నుంచి, జిల్లాల నుంచి కాలినడకగా శ్రీశైలం వెళ్లే శివస్వాములు, భక్తులు పెంట్లవెల్లి మండలం, మల్లేశ్వరానికి చేరుకొని అక్కడి నుంచి ఇంజిన్‌బోట్ల ద్వార కృష్ణానదిలో కొంతదూరం ప్రయాణించి సంఘమేశ్వరానికి చేరుకుంటారు. అక్కడి నుంచి కాలినడకగా వెంకటంపల్లి మీదుగా శ్రీశైలానికి ప్రతి సంవత్సరం కాలినడకగా వెళ్తుంటారు.

ఆపిన పోలీసులు

ప్రతి సంవత్సరం శివస్వాములు కృష్ణానదిపై ప్రయాణిస్తుంటారు. ఈ సంవత్సరం కూడా రెండు రోజులుగా శివస్వాముల ప్రయాణం కొనసాగుతూనే ఉంది. కాని కొద్ది రోజుల కిందట తెలంగాణలో సోమశిల, సంఘమేశ్వర ప్రాంతాల వారి మధ్య గత కొద్ది రోజుల కిందట పెద్ద ఘర్షణ జరిగింది. దాంతో గత నెల 15 రోజుల నుంచి బోటు వేయడం ఇరుప్రాంతాల వారు బంద్ చేశారు. మళ్లీ రెండు రోజులుగా మల్లేశ్వరానికి చెందిన ఈ బోట్లు శివస్వాములను ఎక్కించుకొని సంఘమేశ్వరానికి వస్తుండటంతో అక్కడి వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం ఎస్‌ఐ బోట్లు నిలపాలని సిబ్బందికి ఆదేశాలివ్వడంతో మంగళవారం సాయంత్రం నుంచి బోట్లు నిలిపివేశారు. దాంతో దాదాపు 400 మంది శివస్వాములు ఎటు వెళ్లాలో తెలియక అటు అధికారులు పోనివ్వక కృష్ణానది ఒడ్డున కూర్చొండిపోయారు. కనీసం మంచినీళ్లు లేక, తిండి లేక భక్తులు ఇబ్బందులు పడ్డారు.


బోటు కోసం వేచిచూస్తున్న శివస్వాములు, భక్తులు

సంఘటన స్థలానికి సీఐ, ఎస్‌ఐ..

బుధవారం విషయం తెలుసుకున్న కొల్లాపూర్ సీఐ యాలాద్రి, పెంట్లవెల్లి ఎస్‌ఐ రామేశ్వర్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని సమస్యను పరిష్కరించారు. ఇరువురితో మాట్లాడి స్వాములను అవతలి ఒడ్డుకు చేర్చారు.

నల్లమలలో మార్మోగుతున్న శివనామస్మరణ

అచ్చంపేట: శ్రీశైలం మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాలను, ఇరుముడి సమర్పించేందుకు శివస్వాములు తరలి వెళ్తున్నారు. నల్లమల కొండలు, గుట్టలు శివనామస్మరణతో మార్మోగుతున్నాయి. శ్రీశైలం జాతీయ రహదారి పాదయాత్ర స్వాములతో కనిపిస్తుంది. పలు ప్రాంతాల నుంచి స్వాములు, భక్తులు తరలి వస్తుండంతో అభయారణ్య ప్రాంతంలో రద్దీ పెరిగింది. ఈ నెల 18న మహాశివరాత్రి వేడుకలు తిలకించేందుకు రాష్ట్రం నుంచి భక్తులు మల్లన్న దర్శనం కోసం పాదయాత్రగా వెళ్తున్నారు. మదిలో శివయ్యను తలుస్తూ.. సూదర ప్రాంతాల నుంచి అలుపెరగని కాలినడక సాగిస్తున్నారు. ఏ చెట్లు, గుట్టలు, కాలిబాటలు చూసినా శివస్వాములే దర్శనమిస్తున్నారు. ఎంతో నిష్ఠతో 41 రోజుల పాటు శివదీక్ష బూని భక్తి పారవశ్యంతో ముందుకు సాగుతున్నారు. నల్లమల అటవీ ప్రాంతంలో ఆధ్యాత్మిక, సామాజిక సేవకులు అన్నదానం, పండ్లు, తాగునీటి సదుపాయం కల్పిస్తూ.. శివస్వాములు సేవలు అందిస్తున్నారు. అచ్చంపేట, మన్ననూర్ నుంచి అటవీ మార్గం వెంట వటువర్లపల్లి వైపుగా శివస్వాములు పాదయాత్ర చేస్తున్నారు.


పాదయాత్ర చేస్తున్న శివస్వాములు


అన్నదానం చేస్తున్న స్థానికులు

హోరాహోరీగా బండలాగుడు పోటీలు


బండలాగు పోటీలో హోరాహోరీగా తలపడుతున్న వృషభరాజులు

అయిజ: పట్టణంలోని తిక్క వీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో రైతు సంబరాల కార్యక్రమాన్ని బుధవారం అట్టహాసంగా ప్రారంభించారు. అంతర్రాష్ట్ర వృషభ రాజుల బల ప్రదర్శన (బండలాగు పోటీలు)లో పాలపళ్ల విభాగానికి చెందిన 15 జతల ఎద్దులు హోరాహోరీగా తలపడ్డాయి. నంద్యాల జిల్లా, ఎస్ కొత్తూరుకు చెందిన బీరం సుబ్రహ్మణ్యరెడ్డి ఎద్దులు 15 నిమిషాలలో 4,565 అడుగుల దూరం బండను లాగి ప్రథమ బహుమతి రూ.30,016 గెలుచుకున్నాయి. అదేవిధంగా కర్నూలు జిల్లా, వెల్దుర్తి మండలం, కలుగొట్ల గ్రామానికి చెందిన గొంది బజారి ఎద్దులు 4,279 అడుగుల దూరం లాగి ద్వితీయ బహుమతి రూ.20,016 కై వసం చేసుకున్నాయి. నంద్యాల జిల్లా కొత్తూరుకు చెందిన బీరం సుబ్రహ్మణ్యం ఎద్దులు (రెండో జత) 4,200.6 అడుగుల దూరం లాగి తృతీయ బహుమతి రూ.15,016 సొంతం చేసుకున్నాయి. నంద్యాల జిల్లా, ఎస్ కొత్తూరుకు చెందిన అనూష రాణి ఎద్దులు 4,200 అడుగుల దూరం లాగి నాలుగో బహుమతి రూ.10,016 కై వసం చేసుకున్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా, గట్టు మండలం, గొర్లఖాన్‌దొడ్డికి చెందిన నవనీత్ రెడ్డి ఎద్దులు 3,988.7 దూరం లాగి ఐదో బహుమతి రూ.8,016 కై వసం చేసుకున్నాయి. కలుగొట్లకు చెందిన కృష్ణ ఉత్తమ రథసారథిగా ఎంపికయ్యారు. వృషభరాజుల బలప్రదర్శన చూసేందుకు వివిధ మండలాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

పట్టపగలు చోరీ

- నగదు, బంగారం, వెండి అపహరణ


వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

మరికల్: పట్టపగలే ఓ ఇంట్లో చోరీ జరిగింది. మరికల్‌లోని మాధవరం రోడ్డు పక్కన నివాసం ఉంటున్న కొబ్బరిబోండాల వ్యాపారం చేస్తున్న లంబడి వెంకటమ్మ, నర్సిములు ఎప్పటిలాగే బుధవారం ఇంటికి తాళం వేసి దుకాణానికి వచ్చారు. మధ్యాహ్నం 2గంటల సమయంలో భోజనం కోసం వెళ్లగా ఇంటితాళం విరగ్గొట్టి ఉండటంతో ఇంట్లోకి వెళ్లి చూశారు. బీరువాలోని దుస్తులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. 6 తులాల బంగారం, 32 తులాల వెండి, రూ.1.70 లక్షలు ఎత్తుకెళ్లిన్నట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే ఘటనా స్థలానికి సీఐ శ్రీకాంత్, ఎస్‌ఐ అశోక్‌బాబు వెళ్లి పరిశీలించారు. అనంతరం నారాయణపేట నుంచి క్లూటీంను రప్పించి వేలిముద్రలు సేకరించారు.

విద్యుత్ అంతరాయాలు లేకుండా చర్యలు

- ట్రాన్స్ కో డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): వచ్చే ఎండా కాలానికి విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది సన్నద్ధం కావాలని ట్రాన్స్ కో డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి ఆయన జిల్లా ట్రాన్స్ కో అధికారులతో వీసీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. వేసవిలో విద్యుత్ డిమాండ్ ఈ సారి విపరీతంగా పెరిగే అవకాశం ఉందని, దానికి తగినట్లుగా సరఫరా చేయాలన్నారు. తరచూ వచ్చే బ్రేక్ డౌన్‌లు రాకుండా చూసుకోవాలన్నారు. యాసంగికి 24 గంటల విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు తమ బోర్ల మోటార్లకు ఆటో స్టార్టర్‌ను వాడవద్దని సూచించారు. ఒక వేళ ఉంటే వాటిని మాములు స్టార్టరులకు మార్చుకోవాలన్నారు. జిల్లా కేంద్రంలో 24 గంటల పాటు విద్యుత్ అందుబాటులో ఉండేలా కంట్రోల్ రూంను ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ వినియోగదారులకు ఏమైన సమస్యలు ఉంటే 08542-272714, 9440768928 నంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాన్స్ కో ఎస్‌ఈ శ్రీరాంమూర్తి, డీఈ చంద్రమౌళి ఇతర అధికారులు పాల్గొన్నారు.

వరిలో జింకులోపం.. నివారణ

పాడి-పంట
అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్


వరిలో జింక్ లోపం

అలంపూర్: జిల్లాలోని నేలల్లో జింకు ధాతువు లోపం గుర్తించినట్లు వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియనాయక్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కూడా ఈ సమస్య ఉందని పేర్కొన్నారు. గత 25 సంవత్సరాలుగా అధిక దిగుబడులు ఇచ్చే రకాలు సాగు చేయడం, సంవత్సరానికి రెండు పంటలు పండించడం, కేవలం నత్రజని, భాస్వరం, పోటాష్ ఎరువులను వాడటం వలన జింకులోపం గమనించడం జరుగుతుందని వివరించారు.

జింకు ధాతువు ప్రాముఖ్యత..

మొక్కలలో మాంసకృతులు అమినో ఆమ్లాల తయారీకి నత్రజని, భాస్వర పోషకాల సమర్థ వినియోగానికి ఇది తోడ్పడుతుంది.

- మొక్క పెరుగుదలకు కావాల్సిన ఇండోల్ అసిటిక్ ఆమ్లము ఉత్పత్తిలో ప్రధాన పాత్ర పోషిస్తోంది.
- పత్ర హరితంలో జింకు ముఖ్య ధాతువుగా, కిరణ జన్య సంయోగ క్రియకు తద్వారా ఆహార తయారీకి ఉపయోగపడుతుంది.

జింకు లోపానికి ప్రధాన కారణాలు

- సేంద్రియ ఎరువులను తగినంత మోతాదులో వాడకపోవడం.
- భూమిలో క్షార గుణం, సున్నపుపాళ్లు ఎక్కువగా ఉండటం.
- సంవత్సరం పొడవున ఎక్కువ కాలం నీరు నిల్వ ఉంటూ మురుగు పోకుండా ఉండటం.
- వరి పంటనే ప్రతి సంవత్సరం వేయటం.
- ఉదజని సూచిక 8.0 కంటే ఎక్కువగా ఉండటం
- కొత్తగా అచ్చుకట్టిన పొలాల్లో ఈ ధాతువు లోపం కనిపిస్తోంది.
- సమస్యాత్మక నేలలను బాగు పరిచే క్రమంలో నేలల్లో ఒక్కోసారి సున్నం ఎక్కువై జింకులోపం కనిపిస్తోంది.

జింకులోప లక్షణాలు..

- నారు మళ్లలో కానీ నాటు వేసిన 2నుంచి 6 వారాల వరకు కనిపిస్తోంది.
- లోప లక్షణాలు ఎక్కువగా పల్లపు ప్రాంతాల్లో కనిపిస్తోంది.
- వరి మొక్కలలో పైనుంచి 3 లేదా 4వ ఆకు మధ్య ఈనె ఆకు పచ్చరంగు కోల్పోయి పసుపు రంగుకు మారుతుంది.
- ఆకు చివరలో, మధ్య ఈనెకు ఇరువైపులా తుప్పు లేదా ఇటుక రంగు మచ్చలు ఏర్పడి తర్వాత ఆకులన్నీ రాలిపోతాయి.

జింకు లోప నివారణకు చర్యలు..

- వరి నాటే ముందు ఆఖరి దుక్కిలో ఎకరానికి 20 కిలోల జింక్ సల్ఫేట్(21 శాతం) వేసుకోవాలి.
- నాట్లు వేసిన తర్వాత 2నుంచి 5 వారాల మధ్య జింకు లోపం కనిపిస్తే పొలంలోని పాత నీటిని తీసి కొత్త నీటిని పెట్టాలి. ఈ చర్య వలన ఉదజని సూచిక 7కు తగ్గి జింక్ లభ్యత పెరుగుతుంది.
- పైరులోపల లక్షణాలు కనిపించినప్పుడు 2 గ్రాములు చీలేటెడ్ జింక్‌ను లీటర్ నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలి.

జింక్ వాడకంలో మెలకువలు:

- పచ్చి రొట్టతోపాటు జింక్ సల్ఫేట్ లభ్యత మరింతగా పెరుగుతుంది.
- భాస్వరం ఎరువుల వాడకానికి జింక్ సల్ఫేట్ వాడకానికి మధ్య కనీసం 3 నుంచి 4 రోజుల వ్యవధి అవసరం.
- జింక్ సల్ఫేట్ ద్రావణాన్ని పురుగు లేదా తెగులు మందులతో కలిపి పిచికారీ చేయరాదు.

లారీ బోల్తా : డ్రైవర్ దుర్మరణం

- ఒకరోజు కిందటే పాప జననం



ఘటనా స్థలంలో లారీ

మాగనూర్: అదుపు తప్పి లారీ బోల్తాపడి డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందిన ఘటన మండల కేంద్రం సమీపంలోని వంతెన వద్ద మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. డ్రైవర్‌కు ఒకరోజు కిందటే పాప జన్మించగా.. ఆ సంతోషం కొన్ని గంటల్లోనే ఆవిరైపోయింది. ఎస్‌ఐ నరేందర్ కథనం మేరకు.. మక్తల్ మండలం బొందలకుంటకు చెందిన రమేశ్ కాచ్‌వార్‌కు చెందిన బాలరాజుగౌడ్ లారీపై డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం కర్ణాటకలోని రాయచూర్ సమీపంలో చొప్ప నింపుకొని మక్తల్ వైపు వెళ్తుండగా మాగనూరు శివారు వంతెన వద్ద లారీ అదుపుతప్పి బోల్తాపడి రహదారి పక్కన నిలిపి ఉన్న హిటాచీని ఢీకొంది. ఈ ప్రమాదంలో రమేశ్ తలకు బలమైన గాయం కావడంతో పాటు అందులో ఇరుక్కుపోయాడు. స్థానికులు అదే హిటాచీ సాయంతో లారీ లోపలి నుంచి మృతదేహాన్ని బయటకు తీశారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, హైవే పెట్రోలింగ్ పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రమేశ్‌కు ఇద్దరు కుమారులు ఉండగా.. సోమవారమే కుమార్తె జన్మించింది. దీంతో ఆ కుటుంబం శోక సంద్రంలో మునిగిపోయింది. రమేశ్ అన్న నాగేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

బెల్లం వ్యాపారి రిమాండ్

- చర్లపల్లి జైలుకు తరలింపు

లింగాల: మండల పరిధిలోని సూరాపూర్‌కి చెందిన మూడావత్ రాజును పీడీ యాక్ట్ కింద అరెస్ట్ చేసి బుధవారం చర్లపల్లి జైలుకు తరలించినట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ జనార్దన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10న నల్లబెల్లం, స్పటికను అక్రమ రవాణా చేస్తూ పట్టుబడినట్లు తెలిపారు. నిషేధిత నల్లబెల్లం, స్పటికను రవాణా చేసినా.. విక్రయించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, అవసరమైతే పీడీ యాక్ట్‌ను అమలు చేస్తామని తెలియజేశారు.

క్లుప్తంగా...

పాలకుర్తిలో రూ.25 కోట్లతో పర్యాటక హోటల్

సాక్షి, హైదరాబాద్: పాలకుర్తిలో పర్యాటక హోటల్ నిర్మాణానికి ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.25 కోట్లు మంజూరు చేశారు. హోటల్ ఏర్పాటుకు పరిపాలనామోదం తెలుపుతూ.. సాధ్యమైనంత త్వరగా భవనాన్ని నిర్మించాలని తెలంగాణ ప్రభుత్వం జీవో నంబర్ 48 జారీ చేసింది. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ.. పాలకుర్తిలో పర్యాటక హోటల్ ఏర్పాటు చేయాలని కోరగానే నిధులు మంజూరు చేసిన సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇక్కడ హోటల్ నిర్మిస్తే.. ఆధ్యాత్మిక కేంద్రమైన పాలకుర్తికి వచ్చే పర్యాటకులు, భక్తులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు.

ఎమ్మెల్యేలకు డబ్బులివ్వొద్దు


రైల్వే ఓవర్ బ్రిడ్జిని ప్రారంభిస్తున్న అర్వింద్

ఆర్మూర్: కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్న రైల్వే ఓవర్ బ్రిడ్జీల నిర్మాణాలు చేసే కాంట్రాక్టర్లు స్థానిక ఎమ్మెల్యేలకు డబ్బులు ఇవ్వవద్దని ఎంపీ ధర్మపురి అర్వింద్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణ శివారులోని మామిడిపల్లి – గోవింద్‌పేట్ రోడ్డులో ఇటీవల నిర్మాణం పూర్తయిన రైల్వే ఓవర్ బ్రిడ్జిని బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మూడు నెలలుగా దక్షిణ మధ్య రైల్వే జీఎంపై ఒత్తిడి చేసి ఈ బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తి చేయించానన్నారు. త్వరలో మామిడిపల్లి నుంచి హైదరాబాద్ రూట్‌లో, అడవి మామిడిపల్లి నుంచి నిజామాబాద్ రూట్‌లో నిర్మిస్తున్న రైల్వే ఓవర్ బ్రిడ్జీల నిర్మాణాలు కూడా పూర్తి చేయిస్తామని తెలిపారు.

ప్రత్యామ్నాయ అడవులకు ఫారెస్ట్ బ్లాక్‌లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఫారెస్ట్ బ్లాక్‌లను రిజర్వ్ చేస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్లు జారీ చేసింది. ప్రభుత్వపరంగా వివిధ ప్రాజెక్ట్‌లు, అభివృద్ధి కార్యక్రమాల నిమిత్తం ఆయా చోట్ల అటవీభూమిని మళ్లించిన నేపథ్యంలో.. ఆయా జిల్లాల్లోని రెవెన్యూ భూమిని ప్రత్యామ్నాయ అటవీ భూములుగా నోటిఫై చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

సాకారమవుతున్న స్వప్నం

- జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్‌కు భూమి పూజలో సీఎం వైఎస్ జగన్
- జిందాల్ ఆధ్వర్యంలో రూ.8,800 కోట్లతో 3 మిలియన్ టన్నుల స్టీల్ ప్లాంట్
- రూ.700 కోట్లతో నీరు, విద్యుత్, ఇతరత్రా మౌలిక వసతుల కల్పన
- జగనన్న మెగా ఇండస్ట్రియల్ హబ్‌లో 1.75 లక్షల ఉద్యోగాలు


వైఎస్సార్ జిల్లా సున్నపురాళ్లపల్లెలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్‌కు భూమి పూజ చేస్తున్న సీఎం వైఎస్ జగన్, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్

సాక్షి ప్రతినిధి, కడప: 'మనందరి చిరకాల స్వప్నం సాకారమౌతోంది. వేలాది మందికి ప్రత్యక్షంగా, లక్షలాది మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు మన ముంగిట్లోకి రానున్నాయి' అని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం సున్నపురాళ్లపల్లెలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అప్పట్లో నాన్న గారు ఉన్నప్పుడు ఈ ప్రాంతం అభివృద్ధి కోసం కలలుకన్నారని, ఇక్కడ స్టీల్ ప్లాంట్ కావాలని ఆలోచించారని చెప్పారు. ఆయన చనిపోయాక జిల్లాను ఏ నాయకుడూ పట్టించుకోనందున జిల్లా మొత్తం వెనుకబాటుకు గురవ్వడం మన కళ్లతో మనం చూశామన్నారు. దేవుడి ఆశీస్సులతో, మీ అందరి చల్లని దీవెనలతో మీ బిడ్డ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాక.. మళ్లీ ఈ ప్రాంతానికి ఒక్కొక్కటిగా పరిశ్రమలు రావడంతో మంచి రోజులు వస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

అగ్రగామి జిందాల్ గ్రూపు

- ఇక్కడ నిర్మించబోయే స్టీల్ ప్లాంట్ మరో 24–30 నెలల్లోపు ప్రారంభమవుతుంది. 3 మిలియన్ టన్నుల ప్లాంటును రెండు దశల్లో కట్టడానికి జిందాల్ కార్యాచరణ తయారు చేశారు. రూ.3,300 కోట్లతో మొదటి దశ పూర్తవుతుంది. ఆ తర్వాత రూ.5,500 కోట్లతో సెకండ్ ఫేజ్ మరో ఐదేళ్లలో అందుబాటులోకి వస్తుంది. మొత్తంగా రెండు దశల్లో రూ.8,800 కోట్లతో ఈ ప్రాంతంలో 3 మిలియన్ టన్నుల సామర్థ్యమున్న స్టీల్ ప్లాంట్ వేగంగా నిర్మాణం పూర్తి చేసుకోనుంది.
- జిందాల్ గ్రూపు చైర్మన్ సజ్జన్ జిందాల్ 28.5 మిలియన్‌ టన్నుల స్టీల్ సామర్థ్యంతో దాదాపు రూ.1.75 లక్షల కోట్ల పెట్టుబడులతో స్టీల్ ఉత్పత్తిలో దేశంలోనే అగ్రగామిగా ఉన్నారు. అటువంటి వ్యక్తి మన ప్రాంతానికి వచ్చి ఇక్కడ 3 మిలియన్ టన్నుల సామర్థ్యంతో స్టీల్ ప్లాంట్ నిర్మాణం ప్రారంభించారు. ఈ ప్లాంట్ కోసం దాదాపు 3,500 ఎకరాలు జిందాల్ ఫ్యాక్టరీకి ఇస్తున్నాం.
- ఇక్కడ జిందాల్ స్టీల్ ఫ్యాక్టరీతోపాటు పక్కన అనుబంధ పరిశ్రమల వ్యవస్థ కూడా ఏర్పడుతుంది. ఫలితంగా ఇక్కడో స్టీల్ సిటీ ఆవిర్భవిస్తుందన్న ఉద్దేశంతో గొప్పగా అడుగులు వేస్తున్నాం. మౌలిక సదుపాయాల కోసం దాదాపు రూ.700 కోట్లు ఖర్చు చేస్తున్నాం.

అపారంగా ఉద్యోగావకాశాలు

- జిల్లాలో ఇప్పటికే కొప్పర్తిలో 550 ఎకరాలు కేటాయించి.. ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ (ఈఎంసీ)ను తీసుకొచ్చాం. ఇక్కడకు దాదాపు రూ.10 వేల కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు వస్తున్నాయి. ఆ 550 ఎకరాల్లో మొత్తం పరిశ్రమలు వస్తే.. మొత్తంగా లక్ష మందికి ఉద్యోగాలు వస్తాయి.
- ఇప్పటికే అక్కడ రూ.1,100 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 11,500 మందికి ఉద్యోగాలకు సంబంధించిన కార్యాచరణ కూడా వేగంగా జరుగుతోంది. అదే కొప్పర్తిలో జగనన్న మెగా ఇండస్ట్రియల్ హబ్ పేరుతో 3,155 ఎకరాలను కేటాయించి.. అక్కడ రూ.18 వేల కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు వచ్చే అవకాశాలు సృష్టిస్తున్నాం. తద్వారా అపారంగా.. 1.75 లక్షల ఉద్యోగాలు వచ్చే పరిస్థితి ఉంది.

15 ఏళ్లకైనా 'సీతారామ' పూర్తవుతుందా?

- ధరణి సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించట్లేదు
- ఆత్మీయ సమ్మేళనంలో మాజీ ఎంపీ పొంగులేటి ధ్వజం


ఖమ్మం జిల్లా వైరాలో పొంగులేటి శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సీతారామ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేసి ఏడేళ్లు గడిచినా ఇంకా ఎందుకు పూర్తి కాలేదని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రశ్నించారు. గోదావరి నీటితో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ప్రతి రైతన్న కాళ్లు కడుగుతామని సీఎంతోపాటు నాయకులు చెప్పారని... ఆ రోజు ఎప్పుడొస్తుందన్నారు. ఖమ్మం జిల్లా వైరాలో బుధవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ప్రభుత్వ విధానాలపై విరుచుకుపడ్డారు. సీతారామ ప్రాజెక్టుకు అనుసంధానమైన రోళ్లపాడు ప్రాజెక్టుకు 2016 ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 19 వేల కోట్లు కాగా గత ఏడేళ్లలో నాబార్డ్ నుంచి రూ. 6 వేల కోట్లు తెచ్చి పనులు చేశారన్నారు. ఇంత తక్కువ నిధులు కేటాయిస్తూ పోతే రాబోయే 15 ఏళ్లకైనా గోదావరి జలాలతో ప్రజల కాళ్లు కడుగుతారా అని ప్రశ్నించారు. ప్రజలు నిత్యం తన నామస్మరణ చేయాలనే తపన తప్ప.. తెలంగాణ బిడ్డల ఇబ్బందులను ముఖ్యమంత్రి కేసీఆర్ పట్టించుకోలేదని పరోక్షంగా విమర్శించారు. గత 15 నెలలుగా 'ధరణి'లో సమస్యలు పరిష్కారమవక రైతులు అవస్థలు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని పొంగులేటి దుయ్యబట్టారు. కరోనా కారణంగా రుణమాఫీ చేయలేకపోయినట్లు చెబుతున్న ప్రభుత్వం రూ. వందల కోట్లు వెచ్చించి సెక్రటేరియట్ ఎందుకు నిర్మించాల్సి వచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఏదని తాను ప్రశ్నిస్తే తన 40 ఎకరాల మామిడి తోటకు ఉచిత కరెంట్ ఇస్తున్నట్లు ఓ నాయకుడు చెప్పడం గర్హనీయమన్నారు. తన సొంత గ్రామంలో 40 ఎకరాల మామిడితోటే లేదన్నారు. కార్పొరేట్ స్థాయి ఆస్పత్రులతో వైద్య, ఆరోగ్య రంగంలో అభివృద్ధి సాధించామని చెప్పడమే తప్ప క్షేత్రస్థాయిలో పేదలకు వైద్యం అందడం లేదని పొంగులేటి ఆరోపించారు. ఈ సమావేశంలో మార్క్‌ఫెడ్ రాష్ట్ర వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

రాంగ్ రూట్లో వచ్చి.. బస్సును ఢీకొని..

- లారీ, బస్సు ఢీకొన్న ప్రమాదంలో కండక్టర్ మృతి
- బస్సు డ్రైవర్‌తో సహా ఎనిమిది మందికి గాయాలు


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆర్టీసీ బస్సు. (ఇన్‌సెట్‌లో) కండక్టర్ సత్తయ్య

మల్యాల(చొప్పదండి): అతివేగం.. అందులోనూ రాంగ్‌రూట్‌లో వచ్చిన ఓ లారీ.. ఆర్టీసీ బస్సును ఎదురుగా ఢీకొట్టడంతో కండక్టర్ బొల్లం సత్తయ్య ఘటనాస్థలంలోనే మృతి చెందాడు. మరో తొమ్మిది మంది గాయపడ్డారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేట శివారులోని బల్వంతాపూర్ అడ్డరోడ్డు వద్ద జాతీయ రహదారిపై బుధవారం ఈ ప్రమాదం జరిగింది. జగిత్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో వరంగల్ వెళ్తోంది. ఇదే సమయంలో కట్టెల లోడుతో జగిత్యాల వైపు వెళ్తున్న లారీ బల్వంతాపూర్ అడ్డరోడ్డు వద్దకు చేరుకుంది. లారీ డ్రైవర్ అతివేగంగా రాంగ్‌రూట్ లో నడపంతో ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. అదే వేగంతో ముందుకు వెళ్లి తాటిచెట్టును ఢీకొని బోల్తాపడింది. లారీ ఢీకొన్న ధాటికి ఆర్టీసీ బస్సు నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో కొడిమ్యాల మండలం శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన ఆర్టీసీ బస్ కండక్టర్ బొల్లం సత్తయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవర్ జక్కు రాములకు తీవ్రగాయాలు కాగా, బస్సులో ఉన్న ఎనిమిది మంది ప్రమాణికులు గాయపడ్డారు. వీరిని జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రయాణికులకు ఆర్టీసీ డిపో మేనేజర్ సాయం అందజేశారు. ఎక్కువ గాయాలైన ఒకరికి 5వేలు, మిగిలిన ప్రయాణికులకు వెయ్యి చొప్పున అందించారు.

ఆటోమెటిక్ స్టార్టర్లు తొలగించండి

- జిల్లాల విద్యుత్ అధికారులకు ఆదేశం
- విద్యుత్, సాగునీరు వృథా అవుతోందనే భావన
- రాష్ట్రవ్యాప్తంగా 27 లక్షలకు పైగా వ్యవసాయ కనెక్షన్లు


ఎస్పీడీసీఎల్ ఆపరేషన్స్ సీజీఎం జారీ చేసిన మెమో కాపీ

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: వ్యవసాయ పంపుసెట్ల వద్ద రైతులు పెట్టుకున్న ఆటోమెటిక్ స్టార్టర్లను వెంటనే తొలగించాలని కింది స్థాయి అధికారులకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయి. ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు.. వెంటనే సంబంధిత జిల్లాల ఎస్‌ఈ, డీఈ, ఏడీఈ, ఏఈలు ఆటోమెటిక్ స్టార్టర్లు తొలగించేలా చర్యలు చేపట్టాలని ఎస్పీడీసీఎల్ సీజీఎం (ఆపరేషన్స్) ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు (మెమో 3817/22- 23) జారీ చేశారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోనూ ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిసింది. రాష్ట్రవ్యాప్తంగా 27 లక్షలకు పైగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి.

అధిక ధరతో కొన్న విద్యుత్తు వృథా అవుతోందనే

వ్యవసాయ పంపు సెట్ల వద్ద ఆటోమెటిక్ స్టార్టర్లను ఉపయోగించడం వల్ల ప్రభుత్వం అధిక ధరకు కొనుగోలు చేసిన విద్యుత్ వృథా అవుతోందని, దాంతోపాటు సాగు నీరు కూడా వృథా అవుతోందని ట్రాన్స్‌కో అధికారులు భావిస్తున్నారు. దీన్ని అరికట్టేందుకే ఆటోమెటిక్ స్టార్టర్లను తొలగించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ ఇచ్చినా ఆర్వోను నియమించరా?

టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోసం షెడ్యూల్ ప్రకటించినప్పటికీ ఎన్నికల సంఘం రిటర్నింగ్ అధికారి (ఆర్వో)ను ఎందుకు నియమించలేదని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ ప్రశ్నించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థి నేరాల సమాచారం తెలిపే నిబంధన ఉందో లేదో తెలియజేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఓటర్ కార్డుతో ఆధార్ కార్డు లింక్ చేసే ప్రక్రియ అర్బన్ ప్రాంతాల్లో ఎందుకు తక్కువ అయిందో చెప్పాలన్నారు. ఈ అంశాలపై చర్చించేందుకు ఎన్నికల సంఘం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని నిరంజన్ డిమాండ్ చేశారు.

ఆలిండియా కబడ్డీ పోటీలకు జగన్‌మోహన్



మహబూబ్‌నగర్ క్రీడలు: ఆలిండియా సివిల్ సర్వీసెస్ కబడ్డీ పోటీలకు జిల్లాకు చెందిన జగన్‌మోహన్‌గౌడ్ (పీఈటీ ఆలూర్) ఎంపికయ్యారు. ఈనెల 20వ తేదీ నుంచి 24 వరకు డెహ్రాడూన్‌లో జరిగే ఆలిండియా సివిల్ సర్వీసెస్ కబడ్డీ పోటీల్లో పాల్గొనే తెలంగాణ జట్టుకు జగన్‌మోహన్‌గౌడ్ ప్రాతినిథ్యం వహించనున్నారు. గత ఏడాది ఆగస్టులో ఎల్బీ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి సివిల్ సర్వీసెస్ కబడ్డీ సెలక్షన్ ట్రయల్స్‌లో జగన్‌మోహన్‌గౌడ్ ప్రతిభ చాటి ఈ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి రమేశ్‌బాబు, పీడీ వేణుగోపాల్, పెటాటీఎస్ జిల్లా కార్యదర్శి రాజవర్ధన్‌రెడ్డి, పీఈటీలు నిరంజన్‌రావు, రామేశ్వరయ్య తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

హాకీ రాష్ట్ర మహిళా జట్టుకు ఎంపిక


ఈశ్వరమ్మ


అఖిల

వనపర్తి క్రైం: ఈనెల 15వ తేదీ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాకినాడలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి సీనియర్ హాకీ మహిళా టోర్నమెంటులో పాల్గొనేందుకు తెలంగాణ రాష్ట్ర జట్టుకు వనపర్తి జిల్లాకు చెందిన ఈశ్వరమ్మ, అఖిల ఎంపికైనట్లు హాకీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కుమార్ తెలిపారు. జాతీయ స్థాయి హాకీ టోర్నమెంట్‌లో చక్కని ప్రతిభకనబర్చి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.

మహిళలకు సోలార్ యూనిట్లు

- మహబూబ్‌నగర్ జిల్లాలో నాలుగు మండలాలు ఎంపిక
- ప్రతి మండలానికి 20 యూనిట్లు


అవగాహన కరపత్రాన్ని విడుదల చేస్తున్న కలెక్టర్ రవినాయక్, డీఆర్‌డీఓ యాదయ్య



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): స్వయం సహాయక సంఘాల మహిళల గృహాలకు సౌర విద్యుత్ యూనిట్లు మంజూరు చేయలని గ్రామీణాభివృద్ధి శాఖ నిర్ణయించింది. పెరుగుతున్న విద్యుత్ చార్జీలను నియంత్రించడం, మరో వైపు పర్యావరణ పరిరక్షణకు జిల్లాలో వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఇందు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. ఈ క్రమంలో సభ్యులకు స్త్రీ నిధి కింద రుణ సదుపాయాన్ని కల్పించనున్నారు.

జిల్లాలో 4 మండలాలు ఎంపిక

జిల్లాలో 16 మండలాలు ఉన్నాయి. ఇందులో పైలట్ ప్రాజెక్ట్ కింద నాలుగు మండలాల్లో ఈ సోలార్ యూనిట్లు ఇచ్చేందుకు నిర్ణయించారు. వాటిలో మహబూబ్‌నగర్ మండలం, చిన్నచింతకుంట, దేవరకద్ర, జడ్చర్లను ఎంపిక చేశారు. ఒక్కో మండలానికి 20 యూనిట్ల చొప్పున మొత్తం 80 యూనిట్లు ఇవ్వనున్నారు. సభ్యురాలు తమ గృహ అవసరాల నిమిత్తం నెలకు 200 నుంచి 300 యూనిట్లు వాడకున్నట్లయితే 2కిలో వాట్స్, 3 కిలో వాట్స్ ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. రోజుకు సుమారు 8 నుంచి 12 యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి అవుతుందని అధికారులు చెబుతున్నారు. యూనిట్ల ఏర్పాట్లలో భాగంగా విద్యుత్ అధికారులు నెట్ మీటరు అమర్చుతారు. అవసరం కంటే అధికంగా ఉత్పత్తి అయితే దానికి నెట్ మీటరు సాయంతో గ్రిడ్‌కు అనుసంధానిస్తారు. దీన్ని ట్రాన్స్‌కో కొనుగోలు చేస్తుంది.

అర్హతలు..

- పొదుపు సంఘంలో సభ్యురాలిగా నమోదై ఉండాలి.
- నెలకు విద్యుత్ బిల్లు కనీసం రూ.200 పైగా రావాలి.
- తమ ఇంటిపై కప్పు శ్లాబుతో ఉండాలి.
- బ్యాంకులో ఎలాంటి రుణ బకాయి పడకూడదు.

సోలార్ వల్ల లాభాలు..

- విద్యుత్ వినియోగ బిల్లులలో తగ్గుదల.
- నిర్వహణ ఖర్చు ఉండదు.
- ఉత్పత్తి అయిన మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు సరఫరా చేసి అవసరానికి వాడుకోవచ్చు.
- పెట్టుబడి 5ఏళ్లలో తీరిపోతుంది.
- సోలార్ ప్యానల్‌కు 25ఏళ్లు, యూనిట్‌కు 5 ఏళ్ల వారెంటీ.

జిల్లాకు 80 యూనిట్లు..



జిల్లాకు 80 యూనిట్లు మంజూరు కాగా, పైలెట్ ప్రాజెక్ట్ కింద 4 మండలాలు ఎంపిక చేశాం. దీనిపై ఆయా మండలాల్లోని మహిళలకు అవగాహన కల్పిస్తాం. ఔత్సాహికులకు రూ.1.25 లక్షల వరకు స్త్రీ నిధి ద్వారా రుణ సదుపాయం కల్పిస్తాం.

– యాదయ్య, డీఆర్‌డీఓ

అవగాహన కల్పిస్తున్నాం..



సోలార్ యూనిట్ల ఏర్పాటుపై మహిళలకు అవగాహన కల్పిస్తున్నాం. యూనిట్ వారంటీ ఐదేళ్లు. సంఘం సభ్యులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– శివప్రసాద్, స్త్రీనిధి ఆర్‌ఎం

కేంద్ర జలశక్తి అభియాన్ బృందం పర్యటన

- నీటి సంరక్షణ పథకాల ప్రగతి పరిశీలన

కోస్గి: కొత్తగా ఏర్పడిన గుండుమాల్ మండలంలో బుధవారం కేంద్ర జలశక్తి అభియాన్ ప్రతినిధులు పర్యటించారు. వర్షపు నీటిని సంరక్షించి భూగర్భజలాల పెంపు కోసం అమలు చేసిన పలు పథకాల సాధించిన ప్రగతిని శాస్త్రవేత్త డాక్టర్ ఎస్ఎస్ విఠల, కేంద్ర జలశక్తి మిషన్ ఏడీ నైనా మహమ్మద్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గుండుమాల్‌లోని వాటర్‌ షెడ్ పథకం, ఉపాధి హామీ పథకాల్లో భాగంగా వర్షపు నీరు వృథాగా పోకుండా వ్యవసాయ పొలాలతో పాటు లోతట్టు ప్రాంతాల్లో నిర్మించిన ఇంకుడు గుంతలను, చెక్ డ్యాంలను చూశారు. మిషన్ కాకతీయ పథకంలో చెరువుల పూడిక తీత పనులు, హరితహారంలో మొక్కల పెంపకం, ఇంటింటికీ ఇంకుడు గుంత నిర్మాణం వంటివి స్థానిక అధికారులు వివరించారు. వాన నీటి సంరక్షణ కోసం అమలు చేస్తున్న పలు పథకాలు విజయవంతం కావడంతో జిల్లాలో గతంలో ఎన్నడూ లేనంతగా భూగర్భ జలం పెరిగిందని అధికారులు తెలిపారు. వర్షపు నీటిని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించడం ద్వారా ఉన్నత లక్ష్యం సాధించవచ్చునని ప్రతినిధులు స్థానిక అధికారులకు సూచించారు. వారి వెంట ఎంపీపీ మధుకర్‌రావు, సర్పంచ్ విజయలక్ష్మి, ఎంపీడీఓ వెంకటయ్య, ఏపీఓ మాధవరెడ్డి ఉన్నారు.


వర్షపు నీటి కోసం ఏర్పాటు చేసిన ఇంకుడుగుంతను పరిశీలిస్తున్న బృందం

యువకుడిపై పోక్సో కేసు నమోదు

మహబూబ్‌నగర్ క్రైం: ఓ మైనర్ అమ్మాయిని నాలుగేళ్ల నుంచి ప్రేమించి..అత్యాచారం చేసిన ఘటనలో ఇంజనీరింగ్ విద్యార్థిపై పోక్సో కేసు నమోదైంది. మహబూబ్‌నగర్ డీఎస్పీ టి.మహేష్ కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ మండలపరిధిలోని ఓ గ్రామానికి చెందిన ఇంటర్ చదువుతున్న అమ్మాయిని అదే గ్రామానికి చెందిన ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న అబ్బాయి ప్రేమిస్తున్నాని చెప్పి.. పలుమార్లు శారీరకంగా వాడుకున్నాడు. కాగా సదరు యువకుడు వేరే యువతిని పెళ్లి చేసుకోవాలని ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో మనస్తాపం చెంది బాలిక ఈనెల 12న అమ్మాయి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. బుధవారం తిరిగి వచ్చిన అమ్మాయి సదరు యువకుడిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

ఘనంగా ముగిసిన పద్యనాటకోత్సవాలు


నృత్య ప్రదర్శనలు ఇస్తున్న చిన్నారులు

స్టేషన్ మహబూబ్‌నగర్: మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శ్రీమిత్ర కళానాట్య మండలి ఆధ్వర్యంలో దేవాలయం ఆవరణలో నిర్వహిస్తున్న పౌరాణిక పద్య నాటకోత్సవాలు బుధవారం రాత్రి ఘనంగా ముగిశాయి. ఉత్సవాల చివరి రోజు శ్రీచంద్రముఖి కల్చరల్ అకాడమీ, నాట్య అకాడమీ విద్యార్థులు చేసిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడితో పాటు ఇతర సంప్రదాయ నృత్యాలు ఎంతో ఆకట్టుకున్నాయి. మహబూబ్‌నగర్ పట్టణానికి చెందిన శ్రీశివాంజనేయ భజన మండలి (శేషాద్రినగర్), శ్రీరాజరాజేశ్వరి భజన మండలి (వెంకటేశ్వరకాలనీ), శ్రీరామలింగేశ్వరస్వామి భజన మండలి (బండమీదిపల్లి) బృందాలు భజనలు ఆలపించారు. ఈ సందర్భంగా శ్రీమిత్ర కళానాట్య మండలి కార్యదర్శి వి.నారాయణ మాట్లాడుతూ గత కొన్నేళ్ల నుంచి మన్యంకొండ బ్రహ్మోత్సవాల సందర్భంగా నాటక ప్రదర్శనలు ఇస్తున్నట్లు తెలిపారు. పద్య నాటకోత్సవాల విజయవంతానికి సహకరించిన వారందరికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, నాట్య మండలి ఉపాధ్యక్షులు నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఇథనాల్ కంపెనీపై ప్రజాఉద్యమం



అప్పంపల్లి వద్ద పాదయాత్రలో గ్రామస్తులు, నాయకులు

మరికల్: చిత్తనూర్ ఇథనాల్ కంపెనీకి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం చేపడితేనే పనులు నిలిచిపోతాయని పాలమూరు అధ్యాయన వేదిక కన్వీనర్ రాఘవచారి అన్నారు. 5వ రోజు బుధవారం ధన్వాడ మండలం మందిపల్లి నుంచి ప్రారంభమైన పాదయాత్ర మందిపల్లితండా, అప్పంపల్లి, మాధవరం, రాంకిష్టాయ్యపల్లి, రాత్రికి కిష్టాపూర్‌కు చేరుకుంది. పాదయాత్ర చేపట్టిన గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులను, రైతులను కలిసి కంపెనీ నుంచి కలిగే నష్టాలను వివరించి తమకు సహకారించాలని కోరారు. కంపెనీ ఎత్తివేత కోసం ఏడాదికి పైగా ఆందోళనలు చేపడుతున్నా ప్రజాప్రతినిధుల నుంచి మద్దతు లభించడం లేదన్నారు. అందుకే ప్రజల మద్దతు కోరుతున్నామని చెప్పారు. చుట్టూ ఉన్న బాధిత గ్రామాల ప్రజలు కలిసికట్టుగా సహకరిస్తే కంపెనీ మూతపడటం ఖాయమన్నారు. కార్యక్రమంలో మురళీ, మణివర్ధన్‌రెడ్డి, వెంకట్రాములు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యాలయంలా పోలీస్‌స్టేషన్

- డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ


లింగాలలో మాట్లాడుతున్న వంశీకృష్ణ

లింగాల: బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారని, అయినా పోలీసులు స్పందించడం లేదని, పోలీసు స్టేషన్ బీఆర్ఎస్ మండల కార్యాలయంగా మారిందని డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రాథోడ్ శివమాలధారులకు అన్నదానం ఏర్పాటు చేశారని, ఈ సందర్భంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తే బీఆర్ఎస్ వారు రాజకీయంగా వాడుకున్నారని ఆరోపించారు. సర్పంచ్ కోనేటి తిర్పతయ్య, మరి కొందరు తమ పార్టీ కార్యకర్తలపై చెప్పులతో కొట్టారని అన్నారు. ఈ దాడులకు సంబంధించి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా, ఆధారాలు ఉన్నా ఎస్ఐ పట్టించుకోవడం లేదన్నారు. 48 గంటల్లో దాడులకు పాల్పడిన వారిని అరెస్ట్ చేయకపోతే పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేపడుతామని తెలిపారు. దాడులకు ప్రతిదాడులు తప్పవనే విషయాన్ని బీఆర్ఎస్ నాయకులు గుర్తుంచుకోవాలన్నారు. అంతకు ముందు నాయకులు, కార్యకర్తలు పోలీసు స్టేషన్‌కు ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో ఎంపీపీ లింగమ్మ, వైస్ ఎంపీపీ నారాయణగౌడ్, నాగేశ్వర్‌రావు, కొండల్‌రావు, లక్ష్మణ్‌నాయక్, వెంకటయ్య, ఇందిరమ్మ, విజయలక్ష్మి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.